


PRGI NO: TGTEL/25/A5314

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




మంచిర్యాల హైదరాబాద్ రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | బుధవారం 12, ఆగస్టు 2026 | సంపుటి :1 సంచిక : 213 | పేజీలు : 8 , వెల.2.00

### పేద పిల్లల కలలకు చిరునామాగా..

# యంగ్ ఇండియా స్కూల్స్

- ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్య
- ప్రతి నియోజకవర్గంలో ఈ విద్యాలయాలు
- కలలకు పునాదులు వేయాలంటే సంకల్పం ఉండాలి
- ఆ సంకల్పంతోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్
- నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలు
- తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి'
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2 లో..



తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నాయని సీఎం వెల్లడించారు.





ఝార్ఖండ్ విద్యార్థుల నిరసన..

## తమ చర్యలను సమర్థించుకున్న పోలీసులు

రాంచీలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైన విద్యార్థుల ర్యాలీకి అడ్డంకులు సృష్టించిన వారి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అయితే, అసెంబ్లీ వైపు పెద్ద సంఖ్యలో వస్తున్న విద్యార్థులను అదుపు చేసేందుకు పరిమితస్థాయిలో బలప్రయోగాన్ని రాష్ట్ర పోలీసు వర్గాలు సమర్థించుకున్నాయి. ర్యాలీ సందర్భంగా పోలీసులు వాటర్ క్యానన్, భాష్పవాయువును ప్రయోగించారు.

2




కేరళ పేరును కేరళంగా మార్చే

## బిల్లుకు లోక్‌సభ ఆమోదం..

కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ ఇవాళ (మంగళవారం) ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే బిల్లును సభలో ప్రవేశపెట్టి మూజువాణి ఓటుతో ఆమోదించారు. రాష్ట్రం పేరును కేరళంగా మార్చాలని కోరుతూ కేరళ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది.

2



2

హిమాచల్ ప్రదేశ్‌లో బీభత్సం..

## భారీ వర్షాలకు 157 మంది మృతి..

హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఇప్పటివరకు 157 మంది మృతిచెందగా.. 257 మంది గల్లంతయ్యారు. జూన్ 30 నుంచి ఆగస్టు 9 మధ్య కాలంలో వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి కారణాలతో ఏకంగా 68 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 89 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాతపడ్డారు.

### తెలంగాణను హెచ్ఐవీ

## రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనకు రేపు(బుధవారం) భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నియంత్రణే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

2



2

అమిత్ షా సభకు

## రావాలి.. విపక్షాల నినాదాలు..

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. మంగళవారం పార్లమెంట్ ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు.

### రేవంత్‌రెడ్డి షెల్ కంపెనీల

## బాగోతాన్ని బయట పెడతాం: కేటీఆర్



2

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (ఖు=) సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు. ఈరోజు (మంగళవారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ (వంతీఖుష్) సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయీ కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు.



2

### పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు

## పాల్పడితే కఠిన చర్యలు: మంత్రి తుమ్మల

పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ) ఆదేశించారు. ఎంఎస్పీ కంటే తక్కువ ధరకు పత్తి అమ్మే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు. 2026-27 సీజన్‌లో 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు అంచనా వేశామని తెలిపారు. ఈరోజు (మంగళవారం) సీసీఐ అధికారులతో పత్తి కొనుగోళ్లపై మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఝార్ఖండ్ విద్యార్థుల నిరసన.. తమ చర్యలను సమర్థించుకున్న పోలీసులు

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

రాంచీలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైన విద్యార్థుల ర్యాలీకి అడ్డంకులు సృష్టించిన వారి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అయితే, అసెంబ్లీ వైపు పెద్ద సంఖ్యలో వస్తున్న విద్యార్థులను అదుపు చేసేందుకు పరిమితస్థాయిలో బలప్రయోగాన్ని రాష్ట్ర పోలీసు వర్గాలు సమర్థించుకున్నాయి.ర్యాలీ సందర్భంగా పోలీసులు వాటర్ క్యానన్, భాష్పవాయువును ప్రయోగించారు. లాఠీ చార్జ్ కూడా జరిగింది. రోడ్డు క్లియర్ చేయాలని పదే పదే అభ్యర్థించినా నిరసన కారులు పట్టించుకోలేదని పోలీసు వర్గాలు తెలిపాయి. కొందరు బ్యారికేడ్లను ధ్వంసం చేశారని, వాహనాలను అడ్డుకున్నారని ఆరోపించాయి. మరోవైపు, ఎలాంటి హెచ్చరికలు లేకుండానే పోలీసులు బలప్రయోగానికి దిగారని విద్యార్థులు ఆరోపించారు. లాఠీ చార్జ్ సందర్భంగా కనీసం 100 మందికిపైగా విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జ్ చేశారని ఓ యువకుడు ఆరోపించారు.పరస్పర ఆరోపణల నేపథ్యంలో ర్యాలీకి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. అడ్డంకులు సృష్టించిన వారు ఎవరో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సోమవారం నాటి నిరసనల్లో 14 మంది పోలీసులకు గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. ఒకరికి తీవ్ర గాయమైందని అన్నారు. అయితే, పరిస్థితిని అదుపు చేసేందుకు వీలైనంత పరిమితిస్థాయిలోనే బలప్రయోగం చేశామని రాంచీ ఎస్ఎస్‌పీ రాకేశ్ రంజన్ చెప్పారు.

# కేరళ పేరును కేరళంగా మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం..

న్యూఢిల్లీ: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ ఇవాళ (మంగళవారం) ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే బిల్లును సభలో ప్రవేశపెట్టి మూజువాణి ఓటుతో ఆమోదించారు. రాష్ట్రం పేరును కేరళంగా మార్చాలని కోరుతూ కేరళ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. అయితే, బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో విపక్ష సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.అయినప్పటికీ బిల్లుపై ప్రక్రియను కొనసాగించిన సభ.. చివరకు మూజువాణి ఓటుతో ఆమోదించింది. తదుపరి ప్రక్రియలో భాగంగా బిల్లును రాజ్యసభకు పంపనున్నారు. రాష్ట్ర అధికారిక పేరును మలయాళంలో 'కేరళం'గా ఉపయోగిస్తున్న నేపథ్యంలో అదే పేరును రాజ్యాంగపరంగానూ అమలు చేయాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకొచ్చిన సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించింది. కాగా, ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీస్ చర్యలకు గాను పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి.

# హిమాచల్ ప్రదేశ్‌లో బీభత్సం.. భారీ వర్షాలకు 157 మంది మృతి..

సిమ్లా: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఇప్పటివరకు 157 మంది మృతిచెందగా.. 257 మంది గల్లంతయ్యారు. జూన్ 30 నుంచి ఆగస్టు 9 మధ్య కాలంలో వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి కారణాలతో ఏకంగా 68 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 89 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువా తపడా డ్రు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు దాదాపు 900 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వం సమయ్యాయి. దీంతో సుమారు రూ.886 కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం వెల్లడించింది.మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా కుల్లు, మండి జిల్లాలు అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యాయి. సుమారు 161 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) వారం రోజులుగా పని చేయడం లేదు. వీటిలో అత్యధికంగా మండిలో 77, సిమ్లాలో 43, కుల్లులో 40 డీటీఆర్‌లు పని చేయకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో రుతుపవనాల కారణంగా ఏటా కురిసే భారీ వర్షాల మాదిరిగానే ఈ ఏడాదీ వానలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా కుల్లు అంతటా నదులు, వాగుల్లో నీటిమట్టాలు అకస్మాత్తుగా పెరిగాయి. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు ముంచెత్తడం వంటి భయంకరమైన దృశ్యాలు కనిపిస్తున్నాయి.అలాగే పలు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడటం, భూమి కుంగిపోవడం వల్ల సుమారు 259 రహదారులు ధ్వంసమయ్యాయి. అత్యంత తీవ్రంగా ప్రభావితమైన మండిలో 120 రోడ్లు మూతపడగా.. ఆ తర్వాత చంబా- 42, కుల్లు- 40, సిమ్లాలో 30 చొప్పున రోడ్లు దెబ్బతిన్నాయి. కాగా, రహదారులను పునరుద్ధరించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన పని చేస్తుండగా.. వర్షాల కారణంగా ఆటంకం ఎదురవుతోంది. దీనికి తోడు హిమాచల్ ప్రదేశ్ అంతటా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారిక లెక్కల ప్రకారం 54 నీటి సరఫరా పథకాలు ప్రభావితమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కాగా, ఇంత నష్టం జరిగినా హిమాచల్ ప్రదేశ్ కష్టాలు మాత్రం ఇంకా తీరలేదు. కాంగ్రా, మండి, హమీర్‌పూర్, సిమ్లా, సిర్మౌర్ జిల్లాలకు భారీ వర్ష సూచనలు ఉన్నట్లు సిమ్లా ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆ ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే చంబా, కుల్లు, సోలన్, బిలాస్‌పూర్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# అమిత్ షా సభకు రావాలి.. విపక్షాల నినాదాలు..

ఇంటర్నెట్ డెస్క్:

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. మంగళవారం పార్లమెంట్ ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలంటూ విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆందోళనపై జరిగే చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానమిస్తారని, అయితే ప్రతిపక్షాలు ప్రభుత్వ సమాధానాన్ని శాంతియుతంగా వినవలసి ఉంటుందని రిజిజు అన్నారు. కాగా, జార్ఖండ్‌లో ఉద్యోగార్థులపై పోలీసుల చర్య, అయోధ్య రామమందిర విరాళాల అపహరణకు నిరసనగా అధికార, విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. మంగళవారం పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎన్డీయే, విపక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్డీయే ఎంపీలు ఆరోపించారు. ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. కాగా, విపక్షాల ఆందోళనల నేపథ్యంలో సభను బుధవారానికి వాయిదా వేశారు.

# పేద పిల్లల కలలకు చిరునామాగా.. యంగ్ ఇండియా స్కూల్స్

ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్య

ప్రతి నియోజకవర్గంలో ఈ విద్యాలయాలు

కలలకు పునాదులు వేయాలంటే సంకల్పం ఉండాలి

ఆ సంకల్పంతోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్

నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలు

తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి'

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నాయని సీఎం వెల్లడించారు.

## సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్..

'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

# తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనకు రేపు(బుధవారం) భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నియంత్రణే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రేపు ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగనుందని మంత్రి తెలిపారు. సుమారు 1500 మంది ర్యాలీలో పాల్గొననున్నట్లు తెలిపారు.హెచ్ఐవీ బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. హెచ్ఐవీ ఇతరులకు, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు సంక్రమించకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలన ప్రచారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'బి పాజిటివ్ టు స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్' నినాదంతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కాగా.. రేపు ఈ ర్యాలీలో మంత్రులు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించనున్నారు. కాలేజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ర్యాలీలో పాల్గొననున్నారు.

# రేవంత్‌రెడ్డి షెల్ కంపెనీల బాగోతాన్ని బయట పెడతాం: కేటీఆర్

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (ఖు=) సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు. ఈరోజు (మంగళవారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ (౧వంతీఖ్) సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయీ కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు.

## శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా..?

శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గారా.? అని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడెకరాలను కేటాయించడంపై కేసు నమోదైందని ప్రస్తావించారు. ముడా స్కాంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ఎనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే పేర్కొన్నారు. కొండల్‌రెడ్డికి ఆ సంస్థతో సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ మీటింగ్‌కి ఎలా వెళ్లారని నిలదీశారు. ఈ భూ కేటాయింపులను వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. తిరుపతిరెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తారని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్‌ను కలిసి ఈ విషయంపై విచారణ జరపాలని కోరతామని పేర్కొన్నారు.

## అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తాం..

తెలంగాణలో రూ.74 లక్షల ఓట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయమని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత తమ పార్టీ నేతలు, న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళు తుందా.?, లేదా.? స్పష్టం చేయాలన్నారు. జలసౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండాను మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్రప్రభుత్వం చెప్పినా రాష్ట్ర బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ఈ ప్రభుత్వం చేయాల్సిన పనిని సక్రమంగా చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు: మంత్రి తుమ్మల

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ) ఆదేశించారు. ఎంఎస్పీ కంటే తక్కువ ధరకు పత్తి అమ్మే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు. 2026-27 సీజన్‌లో 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు అంచనా వేశామని తెలిపారు. ఈరోజు (మంగళవారం) సీసీఐ అధికారులతో పత్తి కొనుగోళ్లపై మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తిని అంచనా వేస్తున్నామని చెప్పారు. లాంగ్ స్టేపుల్ కాటన్‌కు రూ.8,667 ఎంఎస్పీ ధర ఉందని అన్నారు. గతేడాదితో పోలిస్తే రూ.557ల ఎంఎస్పీ ధర పెరిగిందని తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు 122 నుంచి 131కు పెంచారని వెల్లడించారు.

## జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయాలి..

తెలంగాణలో 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. 15 నుంచి 30 రోజుల్లో అన్ని జిల్లాల్లో ఈ మిల్లులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రైతుల ప్రతినిధులతో జిల్లా మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు. మధ్యవర్తుల జోక్యానికి తావులేకుండా నేరుగా పత్తి కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ మరింత సరళీకరణ చేస్తున్నట్లు వివరించారు. అధిక దిగుబడి రైతులకు వెంటనే డిజిటల్ అవశ్రీు జవతీఱటఱఝవం ఇస్తున్నట్లు వెల్లడించారు. జిన్నింగ్ మిల్లుల్లో నాణ్యత పరీక్ష పరికరాలు తప్పనిసరని పేర్కొన్నారు.

## సీసీటీవీలు, బరువు యంత్రాలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..

కొనుగోలు కేంద్రాల్లో సీసీటీవీలు, బరువు యంత్రాలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి తుమ్మల చెప్పారు. రద్దీ, పెండింగ్ ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులు ఫిర్యాదులు చేయడానికి టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్: 1800 599 5779, వాట్సాప్ చాట్‌బాట్: 88972 81111లో సంప్రదించాలని సూచించారు. అన్నదాతకు ఎంఎస్పీ ధర అందించడమే తమ ప్రధాన లక్ష్యమని వ్యాఖ్యానించారు. పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

# పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారం ఇవ్వాలి... ప్రధానికి వీహెచ్ లేఖ

న్యూఢిల్లీ,

జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు హనుమంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. స్వాతంత్ర్య సమరయోధుడుకి, భారత జాతీయ పతాక రూపకర్తకు దేశం అందించగల ఏకైక సముచితమైన నివాళి ఇదే అని చెప్పుకొచ్చారు. భారత జాతీయ పతాకం(త్రివర్ణ పతాకం) ప్రాథమిక రూపాన్ని రూపొందించిన ఘనత పింగళి వెంకయ్యకే దక్కుతుందన్నారు. హైదరాబాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని తాను ఏర్పాటు చేసినట్లు లేఖలో తెలిపారు.ఇప్పుడు భారత జాతీయ పతాకం ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యాన్ని, విస్తృత గుర్తింపును సాధించిందని వీహెచ్ అన్నారు. దివంగత పింగళి వెంకయ్య సేవలను తక్కువ చేసి చూడటం.. భారత పతాక రూపకర్తకు జరిగిన అవమానమన్నారు. తెలుగు రాష్ట్రానికి పింగళి వెంకయ్య సేవలను మోదీ ఎందుకు మరచిపోయారో అర్థం కావడం లేదని తెలిపారు. జాతీయ పతాక రూపకర్తకు భారతరత్న ఇవ్వాలని.. దేశ ప్రజలు ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారని వెల్లడించారు.'ప్రధాని మోదీ 'హర్ ఘర్ తిరంగా' అంటున్నారు.. మంచిదే. జాతీయ జెండా రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యకు సరైన న్యాయం జరగాలంటే భారతరత్న ఇవ్వాల్సిందే. పింగళి వెంకయ్యకు న్యాయం జరగడం వల్ల ప్రజల్లోకి ఒక మంచి సందేశం వెళ్తుంది. స్వాతంత్రం వచ్చిన 25 ఏళ్ల తర్వాత ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై జాతీయ జెండా ఎగరవేశారు' అని ప్రధానికి వీహెచ్ లేఖ రాశారు.

# రేణుకాస్వామి హత్య కేసులో కీలక పరిణామం

### ఏ4 నిందితుడు ప్రదోశ్ అప్రూవర్‌గా మారేందుకు కోర్టులో పిటిషన్

**బెంగళూరు,**

కర్ణాటకలో సంచలనం సృష్టించిన చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న ప్రదోశ్ అప్రూవర్‌గా మారేందుకు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆ పిటిషన్‌లో నటుడు దర్శన్‌కు వ్యతిరేకంగా పలు తీవ్రమైన ఆరోపణలను పిటిషన్ ద్వారా కోర్టుకు సమర్పించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను బహిరంగంగా వెల్లడించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు, తాను ఈ కేసులో ఇరుక్కోవడానికి దర్శన్ ఒత్తిడే కారణమని ఆయన ఇటీవల కోర్టుకు సమర్పించిన పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. హీరో దర్శన్ మొదట రేణుకాస్వామిని దూషించి ఆ తర్వాత కొట్టారని అంతేగాక చెప్పుతో కొట్టాలని పవిత్రగౌడకు దర్శన్ సూచించినట్లు ప్రదోశ్ ఆరోపించారు. అయితే రేణుకా స్వామిని హత్య చేయాలనే ఉద్దేశం తనకు లేదని, అక్కడ ఉన్న కొందరు రేణుకాస్వామిని చంపాలని నిర్ణయించుకున్నారని, దాడిని ఆపేందుకు తాను ప్రయత్నించినా ఎవరూ తన మాట వినలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. సంఘటన సమయంలో రేణుకాస్వామికి భోజనం, నీరు ఇచ్చింది తానేనని.. అనంతరం రేణుకాస్వామి మొబైల్ ఫోన్‌ను తీసుకుని పరిశీలించగా మరిన్ని వివరాలు బయటపడ్డాయని ప్రదోశ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే.. ఈ కేసులో ప్రదోశ్‌తో పాటు మరో ఇద్దరు నిందితులు కూడా అప్రూవర్లుగా మారేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అయితే వీరి అభ్యర్థనలను కోర్టు అంగీకరించాల్సి ఉంది. కోర్టు అనుమతి లభిస్తే కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు అధికారికంగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రదోశ్ పిటిషన్‌లో చేసిన ఆరోపణలు నిజమని కోర్టు ఇంకా నిర్ధారించలేదు. ఈ నేపథ్యంలో ఆయన వాంగ్మూలం, పిటిషన్‌లోని అంశాలు కేసు దర్యాప్తు, తదుపరి న్యాయ పక్రియలో ఎంతవరకు ప్రభావం చూపుతాయనేది ఆసక్తికరంగా మారింది. తాజా పరిణామాలతో ఈ కేసు మరోసారి తీవ్ర చర్చకు దారితీయగా దర్శన్‌కు మరిన్ని చిక్కులు తప్పేలా లేవు.

# అసిఫా మృతికి సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

### విచారం వ్యక్తం చేసిన హోంమంత్రి అనిత

### భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన డిజిపి

**అమరావతి,**

రోడ్డు ప్రమాదంలో విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం కుమార్తె ఎండీ అసిఫా మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఎంతో భవిష్యత్తు ఉన్న అఫిఫా.. 24 ఏళ్ల చిన్న వయస్సులో రోడ్డు ప్రమాదం బారిన పడి అందరికీ దూరమవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండీ అసిఫా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆమె కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. షరీన్ బేగం, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నానని ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం కుమార్తె అఫిఫా రోడ్డు ప్రమాదంలో మృతిపై హోం మంత్రి వంగలపూడి అనిత విచారం వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న.. 24 ఏళ్ల వయసులోనే నిండు జీవితాన్ని కోల్పోవడం బాధాకరమన్నారు. అసిఫా మృతి తీవ్రంగా కలచివేసిందని ఆవేదన చెందారు. విషాద సమయంలో అసిఫా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని కోరుకున్నారు. అసిఫా ఆత్మకు శాంతి చేకూరాలని హోం మంత్రి అనిత ప్రార్థించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం కుమార్తె అసిఫా భౌతికకాయానికి ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా నివాళు లర్పించారు. అజిత్ సింగ్ నగర్‌కు చేరుకున్న డీజీపీ, సీపీ.. అసిఫాకు నివాళులర్పించి, షరీన్ బేగంను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆదివారం స్నేహితులతో కలిసి సరదాగా గడుపుదామని కారులో చీరాల బీచ్‌కు బయలుదేరిన అసిఫా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. గుంటూరు జిల్లా ఏటుకూరు సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీ సడెన్ బ్రేక్ వేయడంతో వెనకాల నుంచి వచ్చిన కారు దానిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అసిఫా అక్కడికక్కడే మృతిచెందగా, కారులో ప్రయాణికులు నలుగురు గాయపడ్డారు. వెంటనే వారిని చికిత్స నిమిత్త స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఆసిఫాకు ఎమ్మెల్యే బొండా ఉమ నివాళి

**విజయవాడ,**

ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం కుమార్తె ఎండీ అసిఫా రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అసిఫా మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్న వయస్సులోనే అసిఫా మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. అసిఫా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# సరదాగా బీచ్‌కు బయలుదేరి..అంతలోనే మృత్యు ఒడికి

### ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం కుమార్తె షేక్ ఆసిఫా దుర్మరణం

### రోడ్డు ప్రమాదంపై స్నేహితుల కన్నీరుమున్నీరు

**గుంటూరు**

సెలవు కావడంతో సరదాగా గడుపుదామని ఆదివారం తన స్నేహితులతో కలిసి బీచ్‌కు బయలుదేరిన విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం కుమార్తె షేక్ ఆసిఫా(24) రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. దీంతో ఆమె స్నేహితులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. నల్లపాడు పోలీసుల కథనం ప్రకారం.. ఈ ప్రమాదం గుంటూరు నగర శివారులోని ఏటుకూరు సమీపంలో జరిగింది. కారులో ఉన్న ఆసిఫా ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. తాడేపల్లికి చెందిన ఉండి రుత్విక్ (జిమ్ నిర్వాహకుడు), అవినాష్, సుధీర్, షేక్ ఆసిఫా, వంశీ స్నేహితులు. వీరంతా ఆదివారం ఉదయం చీరాల వెళ్లేందుకు కారులో బయలుదేరారు. ఏటుకూరు సమీపంలోకి వచ్చిన సమయంలో జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో లారీ ఆగింది. కారు నడుపుతున్న అవినాష్ వాహనాన్ని నియంత్రించలేక పోవడంతో లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను తాకి ఆగిపోయింది. కారు ముందుభాగంలో ఎయిర్ బెలూన్లు తెరుచుకున్నాయి. వెనుక సీటులో కూర్చున్న ఆసిఫా తలకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి వచ్చి క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆసిఫా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నల్లపాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. రుత్విక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సుభాని తెలిపారు.

# హత్యారాజకీయాలకు పాల్పడుతున్న వైసిపి

కర్నూలు,

వైసీపీ నేతలపై ఏపీ మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ రాజకీయ హత్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. సోమవారం కర్నూలు జిల్లాలో మంత్రి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కర్నూలు వైసీపీ రౌడీ మూకలు హత్యలు, హత్యాయత్నాలతో అరాచకాలు సృష్టిస్తున్నారని ఆగ్రహించారు. పక్కా పథకం ప్రకారం టీడీపీ కార్యకర్త ఇంతియాజ్‌ను దారుణంగా హత్య చేశారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. హత్యకు గురైన ఆయన గడిచిన ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారని ప్రస్తావించారు. అప్పట్లో తన నామినేషన్ విత్ డ్రా చేసుకోవాలని వైసీపీ వర్గీయులు ఇంతియాజ్‌ను బెదిరించారని.. ఇంటికెళ్లి గొడవకు దిగారని తెలిపారు. ఆ తర్వాత ఆయన టీడీపీలో చేరారని వెల్లడించారు. హత్యకు గురైన ఇంతియాజ్ హంద్రీనదిలో వైసీపీ కబ్జాలను బయట పెట్టారని చెప్పుకొచ్చారు. ఆది మనసులో పెట్టుకుని ఇంతియాజ్‌ను దారుణంగా హత్య చేశారని మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అరుణాచల్‌పై చైనా కుట్రలకు చెక్

## అరుణాచల్ మ్యాప్‌ను విడుదల చేసిన భారత్

**న్యూఢిల్లీ,**

భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రాంతాలను తమవిగా చెప్పుకునే చైనాకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. ఆ రాష్ట్రంలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లు, ఒక సరస్సు సహా 27 కీలక ప్రాంతాలతో కూడిన సవివరమైన ప్రామాణిక మ్యాప్‌ను సర్వే ఆఫ్ ఇండియా విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య సరిహద్దుకు సంబంధించి పూర్తి క్లారిటీతో ఈ మ్యాప్‌ను విడుదల చేసింది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తరువాత ఈ మ్యాప్‌ను ఖరారు చేసినట్టు హోంశాఖ తెలిపింది. తాజా మ్యాప్‌తో ప్రజలకు మరింత అవగాహన పెరుగుతుందని సర్వే ఆఫ్ ఇండియా చెప్పింది. మ్యాప్‌లో తాజాగా చేర్చిన 27 ప్రాంతాల్లో సరిహద్దున ఉన్న మూడు ప్రాంతాలకు (సుబన్‌సిరి జిల్లా) వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. అదే జిల్లాలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లను కూడా మ్యాప్‌లో చూపించారు. ఈ ప్రాంతాలన్నీ మిలిటరీ మ్యాపుల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్నప్పటికీ సర్వే ఆఫ్ ఇండియా మ్యాపులో వీటిని స్పష్టంగా చూపించడమంటే చైనాకు గట్టి కౌంటర్ ఇచ్చినట్టేనని సంబంధిత వర్గాలు తెలిపాయి. మ్యాపులో చూపించిన పలు ప్రాంతాల్లో చైనా, భారత్ దళాల మధ్య ఘర్షణలు జరిగాయి. అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్ అని పిలిచే చైనా ఆ రాష్ట్రంలోని 23 ప్రాంతాలకు కొత్త పేర్లను ఖరారు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ చర్యలతో క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులు ఉండవని చైనాకు భారత్ అప్పట్లోనే గట్టి కౌంటర్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో భాగంగానే ఉంటుందని స్పష్టం చేసింది. చైనా, భారత్‌ల మధ్య సరిహద్దు రేఖ మెక్‌మెహన్ లైన్ టిబెట్, అరుణాచల్ ప్రదేశ్‌ను వేరు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రదేశాలకు భారత్ కొత్త పేర్లను పెట్టింది. కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెడుతున్న నేపథ్యంలో.. దానికి కౌంటర్‌గా ఇండియా కూడా కొత్త పేర్లను ఖరారు చేసింది. భారతీయ మ్యాప్‌లో సుమారు 27 ప్రదేశాలను గుర్తించి .. వాటికి ఇండియా కొత్త పేర్లను పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో ఆ ప్రదేశాలను గుర్తించారు. స్థానికులు గుర్తుపట్టే రీతిలో ఆ పేర్లను పెట్టినట్లు ప్రకటనలో తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెట్టడాన్ని భారత్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. వాస్తవాధీన రేఖ వెంట ఉన్న లాంగ్ జూ ప్రాంతం కూడా కొత్తగా పేరు పెట్టిన ప్రదేశంలో ఉన్నది. ఇక్కడే 1959లో ఇండియా, చైనా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలోకి చైనా దళాలు ఎంటర్ అయ్యాయి. లాంగ్ జూ సమీపంలో ఉన్న మాజా అనే గ్రామాన్ని కూడా కొత్త మ్యాప్‌లో మార్క్ చేశారు. ఇది అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో ఉన్నది. పర్వత ప్రాంతాలైన జో లా, రిజా లా, పుకుర్ లాతో పాటు బిసా గ్రామం కూడా కొత్త లిస్టులో ఉన్నది. హై ఆల్టిట్యూడ్ పాసేజ్‌లో థాగ్ లా ఉన్నది. 1962లో ఇదే ప్రాంతంలో భారత్, చైనా మధ్య ఘర్షణ జరిగింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కూడా అధికారికంగా మ్యాప్‌లో గుర్తించారు. చాంగ్‌లాంగ్ జిల్లాలో ఉన్న జైరాంపూర్‌ను కూడా లిస్టులో పెట్టారు. సాంబో సరోవర్, బారా కుందన్, చోటా కుందన్, దాన్ బారి, ప్రీత్‌నగర్, తెరిత్నగర్, రామ్‌నగర్, జశ్వంత్ ఘర్, సాగర్, పద్మ, జ్యోతినగర్, బైసాకి ప్రాంతాలు కొత్త లిస్టులో ఉన్నాయి. షేర్ ఏ తప్పా స్మారకం, చోటా రూపక్, బారా రూపక్, శివాజీ నగర్, సున్పురా, కమలాంగ్ నగర్, కమలాంగ్ సాంక్చురీ, బుద్ధామందిర్ కూడా జాబితాలో ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశాన్ని .. జాంగ్‌నాన్ అని చైనా పిలుస్తున్నది.




# పట్టిసీమతో కృష్ణా డెల్టాకు ఊపిరి

### ఎల్‌నినో ప్రభావంతో ఆదుకుంటున్న ఎత్తిపోతలు

**విజయవాడ,**

పట్టిసీమతో గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించే కార్యక్రమం కొనసాగుతోంది. ఎల్‌నినో ప్రభావంతో ఇప్పుడు కృష్ణా డెల్టాను గోదావరి జలాలు ఆదుకుంటున్నాయి. గోదావరి నీటితో బ్యారేజ్ నిండుగా ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తోందని తెలిపారు. పట్టిసీమ ద్వారా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 17.52 టీఎంసీల నీటిని కృష్ణానదికి తరలించినట్లు అధికారులు వివరించారు. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాల కారణంగా గోదావరి నది నుంచి ఇప్పటి వరకు 521 టీఎంసీల నీరు సముద్రంలో కలిసినట్లు అధికారులు వివరించారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా సమృద్ధిగా గోదావరి జలాలు వస్తున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీ దిగువన వివిధ కాలువల ద్వారా డెల్టాలోని పంటలకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి 3928 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ నుంచి 3115 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్ నుంచి 115 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు వివరించారు. డెల్టాకు నీటి సరఫరా కోసం మొత్తం కాలువలకు 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎల్‌నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పట్టిసీమ నీరు పంటలకు జీవం పోస్తోందని ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు అభిప్రాయపడ్డారు. సమర్థంగా నీటి నిర్వహణ ద్వారా ఎల్‌నినో పరిస్థితుల్లో సాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు అన్నివిధాలా పనిచేయాలని అధికారులకు సూచించారు. పట్టిసీమ నీటితో కృష్ణా డెల్టా కళకళలాడుతోందని వ్యాఖ్యానించారు. ఎల్‌నినో వేళ పంటలకు పట్టిసీమ నీరే జీవాధారమని పేర్కొన్నారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాకు 17 టీఎంసీల నీటిని తరలిస్తున్నట్లు తెలిపారు. గోదావరి నీటితో నిండుకుండలా బ్యారేజ్ ఉందని పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణమ్మకు వస్తున్న గోదావరి నీటిని తిలకించారు.

# గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడి అనుచరుల వీరంగం

### టోల్ చెల్లించకుండా సిబ్బందిపై దాడికి యత్నం

### పలువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

**లక్నో,**

ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ఎంపీ, గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడు ఉమర్ అహ్మద్ అనుచరులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. నావాబ్‌గంజ్ టోల్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుతో ప్రయాగ్‌రాజ్ పోలీసులు 28 మందిపై కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రోడ్డు ప్రమాదంలో రెండు రోజుల క్రితం మృతి చెందిన సోదరుడి అంత్యక్రియల్లో పాల్గొనడం కోసం ఉమర్ తన అనుచరులతో 28 కార్లలో లఖ్‌నవూ నుంచి ప్రయాగ్‌రాజ్ బయలుదేరాడు. సోమవారం తెల్లవారుజామున 3.50 గంటల ప్రాంతంలో నావాబ్‌గంజ్ టోల్ ప్లాజా వద్ద ఉమర్ అనుచరులు టోల్ ఫీజు చెల్లించుకుండా వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో టోల్ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. టోల్ ఫీజు చెల్లించి అక్కడినుంచి వెళ్లమన్నారు. ఆగ్రహానికి గురైన ఉమర్ అనుచరలు హల్‌చల్ చేశారు. టోల్ సిబ్బందితో తప్పుగా ప్రవర్తించారు. అక్కడినుంచి వెళ్లిపోయే సమయంలో టోల్ బ్యారియర్‌ను ధ్వంసం చేశారు. బూత్ నంబర్ 3 వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. టోల్ ప్లాజా అసిస్టెంట్ మేనేజర్ జైప్రకాశ్ యాదవ్ ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉమర్ అనుచరులు తమను కారుతో తొక్కించి చంపుతామని బెదిరింపులకు దిగినట్లు ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. భయపడిపోయిన టోల్ సిబ్బంది అక్కడినుంచి పక్కకు వచ్చేశారని తెలిపారు. యాదవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు 28 మంది డ్రైవర్లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తాడిపత్రిలో ఉద్రిక్తత..

**అనంతపురం,**

డీఎస్సీలో అక్రమాలపై విచారణ జరిపించాలంటూ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ర్యాలీ కార్యక్రమాన్ని తాడిపత్రిలో పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు జెసి ప్రభాకర్ రెడ్డి ఇంటింటి కార్యక్రమానికి పిలుపునివ్వడంతో ఆయన అనుచరులు వాహనాల్లో పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఇంటి వద్ద మకాం పెట్టారు. ఇరువర్గాల వారు ఎదురుపడితే శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని పోలీసులు ఇరువురి కార్యక్రమాలకు అనుమతి నిరాకరించారు. భారీ సంఖ్యలో బలగాలను మోహరింపజేశారు. తాడిపత్రి వైపు వెళుతున్న వాహనాలను తనిఖీ చేసి పంపించారు. ర్యాలీ కార్యక్రమానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరు కావలసి ఉండగా పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. తాడిపత్రిలో 144 సెక్షన్ విధించినట్లు పోలీసులు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రిలో తిరగడానికి అవకాశం లేదని ఆయన మినహాయిస్తే, ఎవరైనా తాడిపత్రిలో కార్యక్రమాలు చేసుకోవచ్చని జెసి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అనేక దౌర్జన్యాలు దుర్మార్గాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఇదిలా ఉండగా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జెసి ప్రభాకర్ రెడ్డి స్వేచ్ఛగా తిరిగారని పెద్దారెడ్డి గుర్తు చేశారు. ఇందులో భాగంగానే తాడిపత్రి మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగాయని తెలిపారు. దానివల్ల ప్రభాకర్ రెడ్డి చైర్మన్ అయ్యారని అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా హింసను ప్రేరేపించలేదన్నారు.

# ఆర్‌ఎంపి వైద్యుడి వైద్యం

### బాలిక మృతిపై తల్లిదండ్రుల ఆందోళన

**ఖమ్మం,**

:ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బస్వాపురంలో విషాద ఘటన చోటుచేసుకుంది. జ్వరంతో 8వ తరగతి విద్యార్థిని మృతి చెందింది. వైద్యం వికటించడంతోనే తమ కూతురు మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చల్లా రమేశ్, మౌనిక దంపతుల కుమార్తె (14) స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 8వ తరగతి చదువుతోంది. ఆదివారం జలుబు, జ్వరంతో అస్వస్థతకు గురికావటంతో తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆర్‌ఎంపీ చేతికి ఇంజక్షన్ ఇచ్చిన అనంతరం బాలికకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఈసీజీ నిర్వహించి మృతి చెందినట్లు నిర్ధరించారు. బాలికకు వైద్యం చేసిన సమయంలో ఆర్‌ఎంపీ వైద్యుడు మద్యం సేవించి ఉన్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. విద్యార్థిని ఆకస్మిక మృతితో బస్వాపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా తన కుమార్తె మృతికి ఆర్‌ఎంపీ వైద్యుడు కారణమని తండ్రి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆర్‌ఎంపీ వైద్యుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# స్వర్ణాంధ్ర విజన్-2047కు అనుగుణంగా పెట్టుబడులే లక్ష్యం

### పీపీపీ మోడల్ విడుదల చేసిన ప్రభుత్వం

**అమరావతి,**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీపీపీ పబ్లిక్ - ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పాలసీ –2026ను విడుదల చేసింది. స్వర్ణాంధ్ర విజన్–2047కు అనుగుణంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులే ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. రవాణా, లాజిస్టిక్స్, పోర్టులు, విమానాశ్రయాలు, పట్టణ మౌలిక వసతులు, వైద్యం, విద్య, పరిశ్రమలు, పునరుత్పాదక ఇంధనం, పర్యాటకం తదితర రంగాల్లో పీపీపీ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు రూ.1.23 లక్షల కోట్ల విలువైన పీపీపీ ప్రాజెక్టుల పైప్‌లైన్ ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. 2026– 27 ఆర్థిక సంవత్సరానికి రూ.1,500 కోట్ల స్టేట్ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను ప్రభుత్వం కేటాయించింది. ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడంలో కీలక మూలధన అవసరాలను విజిఎఫ్ ద్వారా సర్కార్ భర్తీ చేయనుంది. ప్రాజెక్టుల ప్లానింగ్, అప్రైజల్, ప్రొక్యూర్‌మెంట్, అమలు, పర్యవేక్షణకు స్పష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ప్రారంభ దశలో ఆర్థికంగా లాభదాయకంగా లేని, భవిష్యత్తులో ఆదాయాన్ని సమకూర్చే అవకాశం ఉన్న ప్రాజెక్టులకు ప్రాజెక్ట్ వయబిలిటీ బ్రిడ్జి ఫండ్ ద్వారా వడ్డీలేని రుణాన్ని అందించే విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. ÷–రైవేట్ రంగ పెట్టుబడులు, సాంకేతిక నైపుణ్యం, నిర్వహణ సామర్థ్యాలను వినియోగించుకోవడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. నాణ్యమైన ప్రజా సేవలను అందించడంతో పాటు పెట్టుబడిదారులకు అనుకూలమైన మౌలిక వసతుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న పీపీపీ విధానాలను పరిశీలించడంతో పాటు, సంబంధిత స్టేక్‌హోల్డర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పాలసీని రూపొందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ సంస్థలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు పీపీపీ పాలసీ–2026ను అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం

### సర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు బదిలీలపై నిషేధం

**అమరావతి**

ఏపీలో కీలక అధికారుల బదిలీలపై నిషేధాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ పక్రియ నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కీలక ప్రభుత్వ అధికారుల బదిలీలు, పోస్టింగులపై నిషేధాన్ని అక్టోబర్ 3 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సర్ పక్రియ పూర్తయ్యే వరకు కీలక అధికారుల బదిలీలకు బ్రేక్ పడనుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు జులై 1, 2026 అర్హత తేదీగా నిర్ణయించారు. ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం(ఈసీ) సవరించింది. దీని ప్రకారం, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ÷–లకెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ÷–లకెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార పక్రియ సెప్టెంబర్ 28 వరకు కొనసాగనుంది. అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ సవరించిన షెడ్యూల్ నేపథ్యంలో బదిలీల నిషేధాన్ని ఏపీ ప్రభుత్వం పొడిగించింది. ఈ నిర్ణయం ప్రకారం ఎన్నికల జాబితా సవరణకు సంబంధించిన కీలక అధికారులు అక్టోబర్ 3 వరకు అదే స్థానాల్లో కొనసాగాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ పేరుతో జివో 1545 జారీ అయ్యింది.

PRGI NO: TGTEL/25/A5314
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
ఎడిటర్ : లింగం రాజయ్య
బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

# సంపాదకీయం...

## నిరసనల అణచివేతే పరిష్కారమా?

ప్రజల సమస్య నిజమైనదైతే, నాయకత్వం విశ్వసనీయమైతే, ఉద్యమం మరింత బలపడే అవకాశమూ ఉంటుంది. అందుకే ప్రజాస్వామ్యంలో సంభాషణ, సంప్రదింపులు, పారదర్శకత అత్యంత అవసరం. ఇక్కడ ప్రతిపక్షాల బాధ్యత కూడా తక్కువ కాదు. ప్రజా సమస్యలను రాజకీయ లాభనష్టాల కోణంలో కాకుండా పరిష్కార దిశగా తీసుకెళ్లాలి. నిరసనలను కేవలం ప్రభుత్వ వ్యతిరేక ప్రచార వేదికగా మార్చడం కూడా ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. అలాగే ప్రభుత్వం ప్రతి విమర్శను దేశద్రోహంగా, విదేశీ

కుట్రగా చిత్రీకరించడం కూడా ప్రజాస్వామ్య సంస్కృతికి హానికరం. ఐరమ్ షర్మిలా నుంచి సోనమ్ వాంగ్‌చుక్ వరకు వచ్చిన ప్రతి ఉద్యమం ఒకే సందేశాన్ని ఇస్తోంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాగొంతుకకు అత్యంత శక్తివంతమైన ఆయుధం నిరసన. ఓటు వేసిన తర్వాత కూడా ప్రజలు తమ అసంతృప్తిని, బాధను, డిమాండ్లను ప్రభుత్వానికి వినిపించే రాజ్యాంగబద్ధమైన మార్గమే శాంతియుత ఆందోళన. అయితే భారత రాజకీయ చరిత్రను పరిశీలిస్తే, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఒకే ధోరణి కనిపిస్తుంది. అది నిరసనలను వినడం కంటే వాటిని కాలయాపనతో బలహీనపరచడం. చివరికి ఉద్యమం అలసిపోతుందని, ప్రజలు చెదిరిపోతారని, నాయకత్వం నీరుగారుతుందని అధికార యంత్రాంగం భావిస్తుంది. ఇదే అంశాన్ని ఇటీవల సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి ఉద్యమాల నేపథ్యంలో మళ్లీ దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. వరదలపై తగని ఉదాసీనత భారత ప్రజాస్వామ్య చరిత్రలో నిరసనలను ఎదుర్కొన్న ప్రభుత్వాల వైఖరిలో పెద్దగా మార్పు కనిపించదు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా, ప్రజల ఆందోళనలను తక్షణమే పరిష్కరించేందుకు ముందుకు రావడం కంటే వాటిని చట్టపరమైన చర్యలు, పరిపాలనా నియంత్రణలతో ఎదుర్కొనే ధోరణే ఎక్కువగా కనిపించింది. మణిపూర్‌కు చెందిన ఐరమ్ షర్మిలా పదహారేళ్ల పాటు సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ) రద్దు కోసం నిరాహార దీక్ష చేసినా, ఆమె డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోలేదు. అరెస్టులు, బలవంతపు ఆహార సరఫరా వంటి చర్యలతో ఉద్యమాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించింది. లడఖ్‌కు చెందిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన ఉద్యమం సందర్భంలోనూ ప్రభుత్వ స్పందనపై ఇలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయి.

# ప్రమాదాలకు నిలయంగా మామిడిగట్టు--ఆదిల్ పేట్ రహదారి

అర్జున్ సమాచారం చెన్నూరు
నియోజకవర్గం ప్రతినిధి

మందమర్రి మండలం మామిడిగట్టు గ్రామం నుంచి లిమందమర్రి వైపు వెళ్లే రహదారిపై డీసీఎం వ్యాన్ బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది... మామిడికాట్టెల లోడుతో వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇచ్చే క్రమంలో రహదారి పక్కకు దిగడంతో అదుపుతప్పి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో రహదారి ఇరుకుదనం మరోసారి చర్చనీయాంశంగా మారింది. మామిడిగట్టు నుంచి ఆదిల్ పేట్ వరకు ఉన్న రహదారి పలు ప్రాంతాల్లో ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఒక వాహనం తప్పనిసరిగా రహదారి పక్కకు దిగాల్సిన పరిస్థితి నెలకొంది. రహదారి అంచున ఉన్న మట్టి బలహీనంగా ఉండటంతో వాహనాలు రోడ్డు దిగిన సమయంలో మట్టి కుంగిపోతూ ప్రమాదాలకు కారణమవుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎదురుగా వాహనాలు వస్తే తప్పని పరిస్థితి మామిడిగట్టు నుంచి ఆదిల్ పేట్ వరకు రహదారి వెడల్పు తక్కువగా ఉండటంతో ఎదురుగా భారీ వాహనాలు వచ్చినప్పుడు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా డీసీఎం వ్యాన్లు, లారీలు వంటి భారీ వాహనాలు ఎదురుగా వచ్చిన సమయంలో రెండు వాహనాలు ఒకేసారి రహదారిపై వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఒక వాహనం రహదారి అంచుకు వెళ్లాల్సి వస్తోంది.అలా రహదారి దిగే సమయంలో రోడ్డు పక్కన ఉన్న మట్టి కుంగిపోవడంతో వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. తాజాగా మామిడికాట్టెల లోడుతో వెళ్తున్న డీసీఎం వ్యాన్ కూడా ఇదే పరిస్థితిలో బోల్తా పడటంతో వాహనదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.రహదారి విస్తరణకు అటవీ శాఖ అనుమతులు అవసరం.. మామిడిగట్టు నుంచి ఆదిల్ పేట్ వరకు రహదారికి ఇరువైపులా అటవీ ప్రాంతం ఉండటంతో రహదారి విస్తరణకు అటవీ శాఖ అనుమతులు అవసరమవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అటవీ ప్రాంతం కారణంగా రహదారిని వెడల్పు చేసేందుకు అవసరమైన అనుమతులు లభించకపోవడంతో ఇరుకైన రహదారిపైనే ఏళ్లుగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని వారు చెబుతున్నారు. ఈ రహదారి మీదుగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు, రైతులు, వ్యాపారులు, సరుకు రవాణా వాహనాలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. రహదారి ఇరుకుగా ఉండటంతో ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు.ప్రమాదాలు పెరగకముందే చర్యలు తీసుకోవాలి..

తాజాగా డీసీఎం వ్యాన్ బోల్తా పడిన ఘటనను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు... రహదారి అంచులను పటిష్టం చేయడంతో పాటు ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు...



అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

# ఆట





## వామప్ మ్యాచ్‌లో పోరాడుతోన్న భారత్

శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సన్నాహకంగా జరుగుతున్న వామప్ మ్యాచ్‌లో భారత్ పోరాడుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 90 ఓవర్లలో 8 వికెట్లకు 357 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(164 బంతుల్లో 18 ఫోర్లతో 142 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. రవీంద్ర జడేజా(117 బంతుల్లో 7 ఫోర్లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. మానవ్ సుతార్(90 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 41), సరాన్ష్ జైన్(22), గుర్నూర్ బ్రార్(17 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 36 నాటౌట్) విలువైన పరుగులు చేశారు.శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో రమేష్ మెండీస్, అసంక మనోజ్ రెండేసి వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువాంత తలో వికెట్ తీసారు. భారత్ ఇంకా శ్రీలంక కంటే 6 పరుగుల వెనుకంజలో ఉంది. రెండో రోజు ఆటలో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. విశ్వ ఫెర్నాండో వేసిన తొలి ఓవర్ రెండో బంతికే యశస్వి జైస్వాల్(0).. దిలుమ్ సుదీర్‌కు క్యాచ్ ఇచ్చి సిల్వర్ డక్‌గా వెనుదిరిగాడు. వైడ్‌బాల్‌ను వెంటాడి మరీ మూల్యం చెల్లించుకున్నాడు.

## లియోనల్ మెస్సీ హత్యకు కుట్ర..

ఇటీవల ముగిసిన ఫిఫా ప్రపంచకప్ 2026 సందర్భంగా అర్జెంటీనా స్టార్, ఫుట్‌బాల్ లెజెండ్ లియోనెల్ మెస్సీ హ్యాతకు కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. ఈ అర్జెంటీనా దిగ్గజాన్ని లక్ష్యంగా చేసుకొని టెర్రర్ అటాక్ ప్లాన్ చేసినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైంది. లియోనెల్ మెస్సీని హత్య చేయాలని ఉగ్రమూకలు ప్రయత్నించాయని స్పానిష్ న్యూస్ పేపర్ కథనం ప్రచురించింది. ఇందుకు సంబంధించిన పక్కా సమాచారం అమెరికా పోలీసుల వద్ద ఉందని పేర్కొంది. అయితే ఈ ప్రయత్నాలను అమెరికా ఎఫ్‌బీఐ, అంతర్జాతీయ పోలీస్ సహకార విభాగం నేతృత్వంలోని సెక్యూరిటీ నెట్‌వర్క్ సమర్థవంతంగా ఎదుర్కొన్నాయని ఆ కథనంలో తెలిపింది. ఆత్మహుతి దాడితో మెస్సిని చంపాలని ఉగ్రమూకలు ప్రయత్నించాయని వెల్లడించింది. మెస్సి హ్యాతకు సంబంధించి ఓ దుండగుడు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ పెట్టినట్లు కూడా ఆ కథనంలో పేర్కొన్నారు. 'నా శరీరానికి నాలుగు బాంబులు పెట్టుకొని మెస్సీని పేల్చేసేందుకు అట్లాంటా స్టేడియానికి వెళ్తున్నా'అని నిందితుడు పోస్ట్ పెట్టి తొలిగించినట్లు సమచారం. ఈ పోస్ట్‌తో అప్రమత్తమైన భద్రతా అధికారులు ఉన్నత స్థాయిలో సమీక్షించి కఠిన చర్యలు తీసుకున్నట్లు స్పానిష్ పత్రిక వెల్లడించింది. డాలస్ ఎయిర్ పోర్ట్‌కు వచ్చిన ఓ ఫోన్ కాల్‌ను కూడా అధికారులు పరిశీలించినట్లు తెలుస్తోంది. ఇంట్లో తయారు చేసిన బాంబులతోపాటు ఏఆర్-15 తుపాకీతో స్టేడియానికి వెళ్తున్నట్లు ఆ అనుమానితుడు పేర్కొన్నాడని ఆ కథనంలో రాసుకొచ్చారు. మెస్సితో పాటు ఇతర క్రీడాకారులు, పోలీస్ అధికారులను కూడా లక్ష్యంగా చేసుకున్నారని భద్రతా సిబ్బంది గుర్తించారు. లియోనెల్ మెస్సీతో పాటు క్రిస్టియానో రొనాల్డో కూడా వారి జాబితాలో ఉన్నట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. పోర్చుగల్ ఫుట్‌బాల్ టీమ్ బస ఎక్కడని ఆరా తీసినట్లు కూడా పోలీసుల దృష్టికి వచ్చింది. దాంతో అప్పటి నుంచి భద్రతపరంగా అధికారులు అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. చివరికి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఫిఫా ప్రపంచకప్ ప్రశాంతంగా ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఫిఫా ప్రపంచకప్‌లో స్పెయిన్ విజేతగా నిలవగా.. అర్జెంటీనా రన్నరప్‌తో సరిపెట్టుకున్న సంగతి తెలిసిందే.






## టీమిండియాకు గాయాల బెడద

శ్రీలంక పర్యటనలో ఉన్న టీమిండియాను గాయాల బెడద వేధిస్తోంది. ఇప్పటికే జస్‌ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డి గాయాలతో ఈ పర్యటనకు దూరం కాగా.. జాగా ఈ జాబితాలో సాయి సుదర్శన్ చేరాడు. కాలి బొటన వేలి గాయంతో ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. భారత్-ఏ తరపున శ్రీలంక-ఏతో జరిగిన సిరీస్‌లో సాయి సుదర్శన్ కాలి వేలికి గాయమైంది. అయినా శ్రీలకంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సాయి సుదర్శన్‌ను ఎంపిక చేసిన సెలెక్టర్లు.. ఫిట్‌నెస్ నిరూపించుకుంటే సిరీస్‌లో కొనసాగుతాడని తెలిపారు. అయితే తాజాగా నిర్వహించిన వైద్య పరీక్షల్లో సాయి సుదర్శన్ గాయం తగ్గలేదని తేలింది. దాంతో అతను ఈ సిరీస్ మొత్తానికి దూరం కావాల్సి వచ్చింది. అయితే సాయి సుదర్శన్ దూరమవ్వడంపై బీసీసీఐ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఆ సమయంలోనే అతనికి రిప్లేస్‌మెంట్‌గా మరో ఆటగాడిని ఎంపిక చేయవచ్చు. సాయి సుదర్శన్ స్థానంలో తెలుగు తేజం షేక్ రషీద్‌ను ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన షేక్ రషీద్‌కు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మెరుగైన రికార్డ్ ఉంది. ముఖ్యంగా టాపార్డర్ బ్యాటర్‌గా అతని రికార్డ్స్ మెరుగ్గా ఉన్నాయి. ఇప్పటి వరకు 29 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన షేక్ రషీద్ 46.64 సగటుతో 1959 పరుగులు చేశాడు. ఇందులో 5 శతకాలతో పాటు 10 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇటీవల శ్రీలంక-ఏ జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్‌లోనూ షేక్ రషీద్ మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 63, 20, 45 పరుగులతో రాణించాడు. అయితే షేక్ రషీద్‌కు సర్ఫరాజ్ ఖాన్‌తో పోటీ నెలకొంది. అయితే ఐపీఎల్ తర్వాత సర్ఫరాజ్ ఖాన్ ఎలాంటి ప్రొఫెషనల్ క్రికెట్ ఆడలేదు. సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం లభిస్తుంది. సెలెక్టర్లు సర్ఫరాజ్ ఖాన్‌తో పాటు షేక్ రషీద్ పేర్లను సాయి సుదర్శన్‌కు రిప్లేస్‌మెంట్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రుతురాజ్ గైక్వాడ్ కూడా రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthaminagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.

## ఐదవ రోజు ప్రజా పోరు యాత్ర .సిపిఐ



అర్జున సమాచారం చెన్నూరు నియోజకవర్గం ప్రతినిధి

బెల్లంపల్లి మండలంలోని లంబడి తండా తాళ్ల గురజాల మాల గురుజాల దుగునపల్లి పెర్కపల్లి బట్వాన్పల్లి పాత బెల్లంపల్లి ఆకనపల్లి లింగాపూర్ గ్రామాలలో బెల్లంపల్లి సిపిఐ మండల కార్యదర్శి కామ్రేడ్ బొంతల లక్ష్మీనారాయణ గారి ఆధ్వర్యంలో ప్రజా పోరు యాత్ర జరిగినది ఈ చైతన్య యాత్రకు ముఖ్య అతిథులుగా కామ్రేడ్ మిట్టపల్లి వెంకటస్వామి రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి దాగం మల్లేష్ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి బొల్లంపూర్ణిమ రాష్ట్ర సమితి సభ్యురాలు పాల్గొన్నారు ఈ యాత్ర వెంబడి అన్ని గ్రామాలను తిరిగిన బృంద నాయకులు అడపు రాజమౌళి బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి అంబేద్కర్ తిలక్ బెల్లంపల్లి పట్టణ సహాయ కార్యదర్శి అక్క పెల్లి బాబు డి కె యు జాతీయ సమితి సభ్యులు గుండా చంద్రమాణిక్యం బి కే ఎన్ యు జిల్లా కార్యదర్శి మేకల రాజేశం జిల్లా సమితి సభ్యులు రత్నం రాజం జిల్లా సమితి సభ్యులు దాసరి తిరుపతి గౌడ్ బెల్లంపల్లి బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొండు బానేష్ తాండూర్ మండల కార్యదర్శి గోమాస గంగారాం గురుజాల శాఖ కార్యదర్శి బుడిమే వెంకటేష్ ఆకనపల్లి శాఖ కార్యదర్శి నాయకులు మిట్టపల్లి కుమారస్వామి గార్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైల్లో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా పట్టివేత

అర్జున సమాచారం చెన్నూరు నియోజకవర్గం ప్రతినిధి



సిర్పూర్–టి మండలం విశ్వసనీయ సమాచారం మేరకు ఆర్పీఎఫ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీరామ్ మీనా, డీటీ ఎన్ఫోర్స్మెంట్ రాజ్కుమార్, ఏఎస్ఐ ఆర్. దాసుల సంయుక్త బృందం సిర్పూర్–టి రైల్వే స్టేషన్లో సింగరేణి రైలులో తనిఖీలు నిర్వహించింది. తనిఖీల్లో 35 బస్తాల్లో నింపిన సుమారు 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. తనిఖీ సమయంలో సంబంధిత వ్యక్తులు బియ్యాన్ని వదిలి పరారయ్యారు. అధికారులు బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. సంబంధిత వ్యక్తులను గుర్తించేందుకు విచారణ చేపట్టారు. ప్రభుత్వ రాయితీ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం, దుర్వినియోగం చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## బెజ్జూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ నితికా పంత్



అర్జున్ సమాచారం చెన్నూర్ నియోజకవర్గ ప్రతినిధి

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ మంగళవారం బెజ్జూర్ పోలీస్ స్టేషన్ను తనిఖీ చేశారు. పోలీసుల వందనం స్వీకరించి, సిబ్బంది పరేడ్ను పరిశీలించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్లోని వివిధ విభాగాలు, రికార్డులు, కార్యాలయ నిర్వహణను పరిశీలించి, స్టేషన్ను పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రేవ్ కేసులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, సీడీ ఫైళ్లు, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్ కేసుల వివరాలను ఎస్సై సార్తజ్ పాషాను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేసి, నాణ్యమైన దర్యాప్తుతో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులు, బాధితులతో మర్యాదగా వ్యవహరించి, సమస్యలను ఓర్పుతో విని చట్టప్రకారం త్వరగా పరిష్కరించాలని, సేవాభావంతో విధులు నిర్వహించి ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంచాలని సూచించారు. పోలీస్ సిబ్బంది కిట్ను పరిశీలించి, వారి శాఖాపరమైన అవసరాలు, సమస్యలను తెలుసుకున్నారు. వర్షాకాలంలో వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు.

## యూరప్ మాల్టాలో రోడ్డు ప్రమాదంలో మృతి...

జగిత్యాల జిల్లా ప్రతినిధి:: అర్జున్ సమాచారం ఆగస్టు 11::

పట్టణంలోని ఇస్లాంపురకు చెందిన మహమ్మద్ జవ్వాద్ అనే 27ఏళ్ల యువకుడు...
యూరప్ మాల్టాలో రోడ్డు ప్రమాదంలో మృతి...
ఓ కంపనీలో ఉద్యోగం చేసే యువకుడు ..
కారులో వెళుతుండగా ట్రక్కు బలంగా ఢీకొట్టింది..
ఈ ఘటనలో మహమ్మద్ జవ్వాద్ అక్కడిక్కడే మృతి చెందాడు..



# పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..అజ్మీరా శ్యామ్ నాయక్

అర్జున సమాచారం చెన్నూరు నియోజకవర్గం ప్రతినిధి

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అజ్మీరా శ్యాంనాయక్ పార్టీ శ్రేణులకు సూచించారు. కెరమెరి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్యాంనాయక్, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామంలోని ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కెరమెరి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తెలంగాణలో ప్రభుత్వం ఉన్నట్లా? లేనట్లా?

### తక్షణమే కాళేశ్వరం జలాలను పంటలకు అందించి రైతులను ఆదుకోవాలి

### మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాముని శ్రీనివాస్ డిమాండ్



తెలంగాణలో ప్రభుత్వం ఉన్నట్లా? లేనట్లా? అని ప్రశ్నిస్తూ, తక్షణమే కాళేశ్వరం జలాలను ప్రాజెక్టుల ద్వారా పంటలకు అందించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నకోడూర్ మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాముని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు, రైతు బంధు మాజీ జిల్లా డైరెక్టర్ మేడికాయల వెంకటేశం, సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు కాముని ఉమేష్ చంద్ర, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులతో కలిసి మాట్లాడుతూ వారు ఈ డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా, హరీష్ రావు నీటిపారుదల శాఖ మంత్రిగా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి కాళేశ్వరం జలాలను డ్యాంలలో నింపి రైతులకు సాగునీరు అందించేవారని తెలిపారు. ప్రాజెక్టుల ద్వారా గోదావరి జలాలను పంటలకు అందించకుండా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పరేషాన్ చేస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం సరైన వర్షాలు లేవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిసినప్పటికీ ప్రాజెక్టుల ద్వారా జలాలను విడుదల చేయకపోవడం కక్షసాధింపు చర్యగా కనిపిస్తోందని వారు విమర్శించారు. మధ్య మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసి రంగనాయక సాగర్ను నింపి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ సమయానికి రైతులకు సాగునీరు అందించేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు తక్షణమే కాళేశ్వరం జలాలను అందించాలని కోరారు. చిన్నకోడూర్ మండల పరిధిలో ఇప్పటికే సుమారు 22 వేల ఎకరాల్లో వరి, మక్కజొన్న, టమాట, మిర్చి తదితర పంటలు, అంతర పంటలు సాగు చేశారని, మరో 3 వేల ఎకరాల్లో సాగు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. సాగు చేసిన పంటలకు నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే కాళేశ్వరం జలాలను రైతులకు అందించకుంటే కాంగ్రెస్ మంత్రులు, కాంగ్రెస్ నాయకుల పర్యటనలను రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ అడ్డుకొని నిలదీస్తుందని హెచ్చరించారు. రైతుల సాగునీటి హక్కు కోసం అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాముని శ్రీనివాస్, ములకల కనకరాజు, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కాముని ఉమేష్ చంద్ర, పిన్నింటి అబ్బిరెడ్డి, మేడికాయల వెంకటేశం, ఏలేటి రాజారెడ్డి, కాల్వ ఎల్లం, కట్టుకోజ్వాల వాసు, ధర్మాజీపేట తిరుపతి రెడ్డి, రేగుల దేవయ్య, పుచ్చకాయలు సురేందర్ రెడ్డి, పంపరి కనకయ్య, గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, సందేబోయిన ముత్తయ్య, మన్నే ఆనంద్, నముండ్ల శ్రీనివాస్, ఎదుల రాజిరెడ్డి, పిట్ల ప్రేమ్ చంద్, రామగల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో సమయం వృధా చేయడం కన్నా నైపుణ్యాలు నేర్చుకొని స్టార్ట్ అప్స్ ప్రారంభించండి

### భక్తి దేశ్ ముఖ్- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గర్ల్స్ కన్వీనర్






సోషల్ మీడియాలో సమయం వృధా చేయడం కన్నా నైపుణ్యాలు నేర్చుకొని స్టార్ట్ అప్స్ ప్రారంభించి సైన్స్ ట టెక్నాలజీ లో ముందుకు సాగి
దేశ సమస్యలకు పరిష్కారాలు ఆలోచించాలని ఏబీవీపీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గర్ల్స్ కన్వీనర్ భక్తి దేశముఖ్ అన్నారు. ఈరోజు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ధ్యాన మందిరంలో ఏబీవీపీ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినజనరేషన్ జె యుగంలో భారతీయ నారీ పాత్ర"
(నేటి ఆధునిక యువతరం జనరేషన్ జె కాలంలో) అనే అంశంపై ఏర్పాటు చేసిన సెమినార్ కు ముఖ్య అతిథిగా విచ్చేసిన భక్తి దేశముఖ్ మాట్లాడుతూభారతీయ సంస్కృతిలో నారీకి ఎప్పుడూ అత్యున్నత స్థానం ఉంది. అంటే స్త్రీలను గౌరవించే సమాజంలోనే అభివృద్ధి, శాంతి, సంతోషం ఉంటాయన్నారు. కానీ ఈరోజు నారీ కేవలం కుటుంబాన్ని చూసుకునే వ్యక్తి మాత్రమే కాదు. ఆమె విద్యార్థిని, శాస్త్రవేత్త, సైనికురాలు, వైద్యురాలు, ఇంజనీర్, పారిశ్రామికవేత్త, క్రీడాకారిణి, పరిపాలకురాలు, స్టార్టప్ వ్యవస్థాపకురాలుగా దేశ నిర్మాణంలో తన వంతు పాత్ర పోషిస్తోందన్నారు. జ్ఞానం నారీకి మొదటి ఆయుధమన్నారు. యుగంలో ప్రపంచం వేగంగా మారుతోందన్నారు. వంటి రంగాల్లో కొత్త అవకాశాలు వస్తున్నాయన్నారు. మన అమ్మాయిలు కూడా ఈ రంగాల్లో ముందుకు రావాలన్నారు. విద్య అనేది ఉద్యోగం కోసం మాత్రమే కాదు. సమాజాన్ని మార్చే శక్తి అన్నారు. ఒక అమ్మాయి చదువుకుంటే ఒక వ్యక్తి మాత్రమే చదువుకున్నట్లు కాదు --- ఒక కుటుంబం, ఒక తరం, ఒక సమాజం ముందుకు వెళ్తుందన్నారు. దేశభక్తి -- మాటల్లో కాదు, చేతల్లో చూపించాలన్నారు దేశభక్తి అంటే కేవలం జాతీయ పతాకాన్ని గౌరవించడం లేదా దేశభక్తి నినాదాలు చేయడం మాత్రమే కాదు. నిజాయితీగా చదవడం, బాధ్యతగా పనిచేయడం, ప్రజా ఆస్తిని కాపాడటం, పర్యావరణాన్ని రక్షించడం, సమాజానికి ఉపయోగపడే ఆలోచనలు చేయడం --- ఇవన్నీ దేశభక్తే అన్నారు. ప్రతి యువతి, ప్రతి యువకుడు "దేశం నాకు ఏమి ఇచ్చింది?" అని కాకుండా "నేను దేశానికి ఏమి ఇవ్వగలను?" అని ఆలోచించాలన్నారు.
భారతదేశ భవిష్యత్తు మన యువత చేతుల్లో ఉంది. అందులో భారతీయ మహిళల పాత్ర మరింత కీలకమన్నారు. మనకు కావాల్సింది సంప్రదాయాలను వదిలిపెట్టిన ఆధునికత కాదు. అలాగే అవకాశాలను నిరాకరించే సంప్రదాయం కూడా కాదు. మనకు కావాల్సింది ---
భారతీయ విలువలతో కూడిన ఆధునిక ఆలోచన అన్నారు. సంస్కారం ఉండాలి... ఆత్మవిశ్వాసం ఉండాలి. జ్ఞానం ఉండాలి... సృజనాత్మకత ఉండాలి. దేశభక్తి ఉండాలి. ప్రపంచ స్థాయి ప్రతిభ ఉండాలన్నారు.
ఈరోజు మనం ఒక సంకల్పం చేద్దాం. ప్రతి బాలికకు విద్య, ప్రతి యువతికి అవకాశం, ప్రతి మహిళకు గౌరవం, ప్రతి ప్రతిభకు ప్రోత్సాహం
ఇదే అభివృద్ధి చెందిన భారతదేశానికి పునాది అన్నారు. మన నారీ శక్తి మేల్కొంటే కుటుంబం బలపడుతుంది. కుటుంబం బలపడితే సమాజం బలపడుతుంది. సమాజం బలపడితే దేశం బలపడుతుంది. అందుకే మన నినాదం ఒక్కటే నారీ శక్తి -- దేశ్ కి శక్తి!" అన్నారు. జ్ఞానం -- వ్యక్తిత్వం -- ఐక్యత ఇవే యువ భారతానికి మూడు స్తంభాలు!" అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల లెక్చరర్లు, ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సావుల ఆదిత్య, జిల్లా మహిళా కన్వీనర్ మృదులయ, నగర మహిళా కన్వీనర్ అఖిల, నగర కార్యదర్శి తరుణ్, భారతి, ప్రవళిక విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఆర్థిక ఆరోపణలపై మంథని ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సస్పెండ్

### విధుల నిర్వహణలో నిర్లక్ష్యంపై శాఖాపరమైన చర్యలు

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 11:



మంథని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు సస్పెన్షన్ వేటు పడింది. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి అందిన ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ చేపట్టిన అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. సీనియర్ అసిస్టెంట్‌పై వచ్చిన ఫిర్యాదులను జిల్లా యంత్రాంగం తీవ్రంగా పరిగణించింది. సంబంధిత అంశాలపై ప్రాథమికంగా విచారణ జరిపిన అనంతరం ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే తదుపరి శాఖాపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# పోలీస్ కానిస్టేబుల్ ఉచిత కోచింగ్ ఏర్పాటు చేయాలి

అర్జున సమాచారం చెన్నూరు నియోజకవర్గం ప్రతినిధి




మంచిర్యాల జిల్లాలోని ఇటీవల పోలీస్ శాఖలో ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో క్యాతన్ పల్లి పట్టణంలోని నిరుద్యోగ యువతకు ఉచిత పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజా జాగృతి సమితి అధ్యక్షుడు రాజలింగు మోతె మున్సిపల్ చైర్‌పర్సన్‌కు మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో రిప్రజెంటేషన్ అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అభ్యర్థులు ప్రైవేట్ కోచింగ్ ఫీజులు భరించలేక ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల మున్సిపాలిటీ సామాజిక బాధ్యతగా భావించి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రాత పరీక్షలతో పాటు ఫిజికల్ ట్రైనింగ్, స్టడీ మెటీరియల్, మాక్ టెస్టులు తదితర సౌకర్యాలను ఉచితంగా అందించాలని కోరారు. పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చిన ఈ సమయం చాలా ముఖ్యమైన సమయం కాబట్టి ఈ సందర్భంగా ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా మున్సిపాలిటీ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వేల్పుల వెంకటస్వామి, రామిళ్ళ మల్లేష్,ఎట్టం లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## భీమారంలో పోలీస్ ల విస్తృత తనిఖీలు



భీమారం(మంచిర్యాల), అర్జున్ సమాచారం, ఆగస్టు 11:

మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా భీమారం ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.భీమారం మండల కేంద్రం లో 63వ జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో ఉన్న హోటళ్లు, కిరాణా దుకాణాలు, పాన్ షాపులతో పాటు అనుమానిత ప్రదేశాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయాన్ని వినియోగించి అనుమానాస్పద వస్తువులు, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఆరా తీశారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా భీమారం మండలంలో ఇలాంటి తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

## గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన

### మహిళలు, బాలల భద్రతతో పాటు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 11:

రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో గోదావరిఖని అశోక్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ లావణ్య విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, సామాజిక మాధ్యమాల వినియోగం, సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయపడకుండా షీ టీమ్ 6303923700 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112కు, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళలు ప్రయాణ సమయంలో భద్రత కోసం టి-సేఫ్ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లేష్, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు సురేష్, మౌనిక, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

## యూట్యూబ్ కళాకారుల బోనాల జాతర



జగిత్యాల ప్రతినిధి :: అర్జున్ సమాచారం ఆగస్టు 11::

ఈరోజు జగిత్యాల జిల్లా కేంద్రంలో జిల్లా యూట్యూబ్ కళాకారుల బోనాల జాతర వర్కింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మన సంస్కృతి సాంప్రదాయమైనటువంటి బోనాల పండుగను ఇంత ఘనంగా నిర్వహించినందుకు కళామతల్లి ముద్దుబిడ్డలైన అందరి కళాకారులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్ర మరువలేనిదని అన్నారు. ఆనాడు తెలంగాణ సాధన కోసం కళాకారులు బోనమెత్తితే మళ్ళీ ఈ రోజు ప్రజల సంక్షేమం కోసం కళాకారులు బోనమెత్తారని అన్నారు. దీ=హా హయంలో కేసీఆర్ గారి నాయకత్వంలో కళాకారులను కడుపులో పెట్టి చూసుకున్నాడు అని అన్నారు. కన్నెపల్లి పంప్ హౌస్ ఆన్ చేసి రైతులకు నీళ్లు ఇచ్చే విధంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనువిప్పు కలగాలని అమ్మవారిని కోరుకున్నారు. అమ్మవారి కృప వల్ల జగిత్యాల జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వర్ రావు సారంగాపూర్ మండల అధ్యక్షుడు తేలు రాజు దీ=హా సీనియర్ నాయకులు పడిగేలా గంగారెడ్డి రామకృష్ణ కాలేజ్ అదినేత రామకృష్ణ పట్టణ కౌన్సిలర్లు లక్ష్మీ చంద్ర కల గంగమల్లు గంగాధర్ నాయకులు అనురాధ బొల్లరపు కళ్యాణి నవీన్ ఆరుముల్ల మానస శివకుమార్ భాగ్య లక్ష్మి పుష్ప లక్ష్మణ్ యూట్యూబ్ కళాకారులు నాయకులు భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో జీపీవో



జగిత్యాల ప్రతినిధి ::అర్జున్ సమాచారం ఆగస్టు 11::

ఏసీబీ కి చిక్కిన జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం అత్మకూర్ జీపీవో రాజేశ్.ఓ భూమికి సంభందించిన విషయంలో అయిదువేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు.

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నల్లాల దంపతులు

మందమర్రి ప్రతి నిధి,అర్జున్ సమాచారం, ఆగస్టు 11 :

ఆషాఢ మాస బోనాల సందర్భంగా మందమర్రి పట్టణంలోని సిఎస్‌పి రోడ్డు అమ్మ వారి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పాల్గొని, భోనమెత్తిన మాజీ ప్రభుత్వ విప్ ఒ చెన్నూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు – భాగ్యలక్ష్మి ( మాజీ జెడ్‌పి ఛైర్ పర్సన్ ) దంపతులు .ముందుగా పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భోనాల జాతరను ప్రారంభించారు ఆలయ కమిటీ సభ్యులు ఓదన్న దంపతులకు సాదరంగా తెలుపగా, స్థానిక ప్రజలు ఓదన్న మీద తమ అభిమానాన్ని చాటుకుంటూ ఆప్యాయంగా పలకరించి, తమ కేరింతలతో వెంకటేశ్వర ఆలయం నుంచి సిఎస్‌పి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా భోనాల ఉత్సవాల్లో నృత్యాలు చేస్తూ, ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, సారె, ఓడి బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు



## పెట్టుబడి ముందు ఆలోచించండి.. మోసపోతే 1930కు కాల్ చేయండి

### రిటైర్డ్ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 11:

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా కా తిరంగా -- సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ వైపు' కార్యక్రమంలో భాగంగా ఎన్‌టీపీసీ జ్యోతిక భవన్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు, వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా వచ్చే అధిక లాభాల పెట్టుబడి ఆఫర్లను నమ్మి పదవీ విరమణ అనంతరం వచ్చిన డబ్బులను పెట్టుబడి పెట్టి మోసపోవద్దని సూచించారు. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్, కేవైసీ, పెన్షన్, పీఎఫ్, లాటరీలు, రుణాలు, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఇచ్చే పెట్టుబడి సూచనలను నమ్మవద్దని, అధిక లాభాల పేరుతో వెంటనే పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేసే వారిని నమ్మరాదని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగులతో సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మారుతి, క్రాంతి, హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ హెడ్ జోస్ స్టీఫెన్, బ్యాంకు అధికారులు, సైబర్ క్రైమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 11:




రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తాలోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హన్నన్ మాట్లాడుతూ అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచిస్తూ, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించరాదని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం జరిమానాల నుంచి తప్పించుకోవడానికి మాత్రమే కాకుండా ప్రాణాలను కాపాడుకోవడానికి కూడా అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక





# నాగార్జున 'నాగ్100' నుంచి బిగ్ అప్డేట్..

అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున 100వ చిత్రం 'నాగ్100'పై ఎట్టకేలకు ఓ కీలక అప్డేట్ బయటకు వచ్చింది. కొంతకాలంగా ఈ ప్రాజెక్ట్ గురించి రకరకాల వార్తలు, ఊహాగానాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషనల్ కార్యక్రమాలను ప్రారంభించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నాగార్జున పుట్టినరోజు ఆగస్టు 29. ఈ ప్రత్యేక రోజునే 'నాగ్100' ప్రమోషన్లకు శ్రీకారం చుట్టనున్నట్లు తాజా సమాచారం. ఇందులో భాగంగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు ప్రత్యేక బర్త్‌డే గ్లింప్స్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేయనున్నారని తెలుస్తోంది. ఇప్పటివరకు 'నాగ్100'కు సంబంధించి అధికారికంగా పెద్దగా వివరాలు బయటకు రాకపోవడంతో.. ఆగస్టు 29న విడుదల కానున్న అప్డేట్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. నాగార్జున 100వ సినిమా కావడంతో ఈ ఫస్ట్ లుక్ ఎలా ఉండబోతుందనే చర్చ కూడా మొదలైంది. నాగార్జున తన కెరీర్‌లో ఎన్నో విభిన్నమైన పాత్రలు, ప్రయోగాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు ఆయన కెరీర్‌లో అత్యంత ప్రత్యేకమైన మైలురాయిగా నిలవబోతున్న 100వ చిత్రం కావడంతో 'నాగ్100'పై సహజంగానే అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా కథ, కాన్సెప్ట్, నాగార్జున పాత్రతో పాటు భారీ తారాగణం ఉంటుందా? అనే విషయాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అయితే ఇప్పటివరకు మేకర్స్ మాత్రం ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడించలేదు





# 'లెనిన్' దర్శకుడితో సినిమా?

రవితేజ తాజా చిత్రం 'ఇరుముడి' పాజిటివ్ బజ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఈ నెల 21న సినిమా విడుదలకానుంది. దీని తర్వాత హసిత్‌గోలి దర్శకత్వంలో శ్రీవిష్ణుతో కలిసి రవితేజ ఓ మల్టీస్టారర్ చిత్రాన్ని చేయబోతున్నారు. దిల్‌రాజు నిర్మాత. వివేక్ ఆత్రేయ, మారుతి కూడా రవితేజ కోసం కథలు సిద్ధం చేశారని తెలుస్తున్నది. ఇదిలావుండగా రవితేజ లైనప్‌లో మరో సినిమా ఖరారైనట్లు వార్తలొస్తున్నాయి. ఇటీవలే 'లెనిన్'తో అక్కినేని అఖిల్‌కు బ్లాక్‌బస్టర్ హిట్ అందించారు దర్శకుడు మురళీకిషోర్ అబ్బూరు ఆయన దర్శకత్వంలో రవితేజ ఓ సినిమా చేయబోతున్నారని, ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయని, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనుందని ఫిల్మ్‌నగర్ టాక్. నిజానికి మూడేళ్లక్రితమే 'లెనిన్' కథను రవితేజకు వినిపించారట దర్శకుడు మురళీకిషోర్. అయితే అప్పటి కమిట్‌మెంట్స్ కారణంగా రవితేజ ఆ సినిమా చేయలేకపోయారని తెలిసింది. ఈ నేపథ్యంలో 'లెనిన్' దర్శకుడి సినిమాకు రవితేజ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం రవితేజ లైనప్‌ని చూస్తే మురళీకిషోర్ అబ్బూరు చిత్రం కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉందని అంటున్నారు.

# డిప్యూటీ కమిషనర్ గౌరీ హెగ్డే

తమిళ అగ్ర నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా, టాలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో 'స్లమ్ డాగ్ : 33 టెంపుల్ రోడ్' చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. బలమైన భావోద్వేగాలతో కూడిన పవర్‌ఫుల్ యాక్షన్ మిస్టరీ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా త్వరలో విడుదల కానున్నది. సీనియర్ హీరోయిన్ టబూ ఇందులో కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. ఆమె పాత్రకు సంబంధించిన పవర్‌ఫుల్ గ్లింప్స్‌ని సోమవారం మేకర్స్ విడుదల చేశారు. ఆద్యంతం స్లమ్ ఏరియా వాతావరణాన్ని పరిచయం చేస్తూ ఈ గ్లింప్స్ సాగింది. అక్కడ కారు దిగి, సిగరెట్ వెలిగించి, పరిస్థితులను తన కంట్రోల్‌లోకి తీసుకునే డిప్యూటీ కమిషనర్, ఇన్‌కమ్‌ట్యాక్స్ గౌరీ హెగ్డేగా టబూ గ్లింప్స్‌లో కనిపించారు.



# మెగా ఆఫర్ కొట్టేసిందట?

గత ఏడాది సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం'.. ఈ ఏడాది సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు'.. ఇలా వరుస సంక్రాంతి విజయాలతో పండుగ హీరోయిన్‌గా పేరు గాంచింది హర్యానా అందం మీనాక్షి చౌదరి. ప్రస్తుతం నాగచైతన్యతో 'వృషకర్మ' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నది ఈ అందాలభామ. ఇదిలావుంటే.. ఓ అపూర్వమైన అవకాశం మీనాక్షి చౌదరి తలుపు తట్టినట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మెగా 158'(వర్కింగ్ టైటిల్) చిత్రంలో మీనాక్షి చౌదరి నటించనున్నదట. అయితే.. ఆమెది హీరోయిన్ పాత్ర కాదని, ఓ అతిథి పాత్రలో ఆమె కనిపిస్తుందని తెలుస్తున్నది. ఈ సినిమా ఫ్లాష్‌బ్యాక్‌లో ఆమె పాత్ర ఉంటుందట. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే మెగాస్టార్ పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయని, మాఫియా నేపథ్యంలో ఆయన పాత్ర సాగుతుందని వినికిడి. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా సాగే ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, లోహిత్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# అజిత్ సినిమాలో అతిథి పాత్ర?

తమిళ అగ్ర నటుడు అజిత్‌కుమార్ తాజా చిత్రం 'డేర్‌డేవిల్' సెప్టెంబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను భారీ కమర్షియల్ హంగులతో తెరకెక్కించబోతున్నారు. షాలిని అజిత్ కుమార్ ఈ చిత్రానికి నిర్మాత. ఈ పాన్ ఇండియా సినిమాలో కీలకమైన అతిథి పాత్ర కోసం చిత్రబృందం అగ్ర నటుడు వెంకటేష్‌ను సంప్రదించినట్లు వార్తలొస్తున్నాయి. కథాగమనంలో ఈ గెస్ట్‌రోల్ చాలా కీలకంగా ఉంటుందని, స్క్రీన్‌స్పేస్ కూడా చాలా ఎక్కువేనని చెబుతున్నారు. ఈ సినిమాలో వెంకటేష్ అతిథి పాత్రలో నటించడం దాదాపు ఖాయమైందని తమిళ సినీవర్గాల్లో వినిపిస్తున్నది. అయితే ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ఇదే సినిమాలో మరో ఇంపార్టెంట్ రోల్ కోసం చిత్రబృందం మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. మొత్తానికి స్వీయ నిర్మాణంలో అజిత్ హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న 'డేర్‌డెవిల్' చిత్రం నిర్మాణ దశలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది.





# కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: కేంగర్ల మల్లయ్య

**మంచిర్యాల, అర్జున్ సమాచారం, ఆగస్టు 11 :**

తెలంగాణ గని బొగ్గు గని కార్మిక సంఘం (టిజిబికేఎస్) చేపట్టిన 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే -7 గనిని టిజిబికేఎస్ వ్యవస్థాపక కన్వీనర్ కేంగర్ల మల్లయ్య సందర్శించారు. ఈ సందర్భంగా గనిలో పనిచేస్తున్న సీనియర్ కార్మికులు ఆయనను కలసి తమ క్షేత్రస్థాయి సమస్యలను విన్నవించుకున్నారు. యాజమాన్యం రేజింగ్ పెంపుపై దృష్టి పెడుతున్నప్పటికీ, దానికి తగినట్లుగా కార్మికులకు సరైన రక్షణ పరికరాలు, పనిముట్లు ఇవ్వడం లేదని కార్మికులు వాపోయారు. ముఖ్యంగా డ్రిల్ బిట్లు, సేఫ్టీ షూస్, రైజింగ్ క్యాప్సూల్స్ వంటి అత్యవసర సామాగ్రి కొరత తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఫిర్యాదులపై కేంగర్ల మల్లయ్య తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ --- "గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కేవలం పైరవీలకే పరిమితమయ్యాయి. కార్మికుల భద్రతను, సంక్షేమాన్ని గాలికి వదిలేశాయి" అని ఘాటుగా విమర్శించారు. అలాగే, మెడికల్ బోర్డు వ్యవహారంపై కూడా ఆయన మండిపడ్డారు. ఇటీవల జరిగిన మెడికల్ బోర్డులో కేవలం 20 శాతం మంది కార్మికులనే అన్-ఫిట్ చేశారని, ఇది ఎంతమాత్రం సరికాదని అన్నారు. మెడికల్ బోర్డు కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరినీ అన్-ఫిట్ చేసి, వారి వారసులకు తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ బాయిబాట కార్యక్రమంలో టిజిబికేఎస్ ముఖ్య నాయకులు ముదిగిరి మల్లేష్, నాగుల మోహన్ రావు, దొడ్ల సతీష్, పెండ్యాల శ్రావణ్, దాసరి అఖిల్, జక్కుల శంకర్, శేఖర్, భాస్కర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ పట్టాల రద్దు వరకే అధికారుల పరిమితం

## అక్రమ పట్టాదారులపై చర్యలకు వెనకడుగు

## మంథని డివిజన్ దళిత సేన అధ్యక్షుడు ఊట్ల శ్రీను

**అర్జున్ సమాచారం. ఆగస్టు.11/ముత్తారం. రిపోర్టర్**

అక్రమ పట్టాలు రద్దు చేయడం వరకే అధికారులు పరిమితమయ్యారని అక్రమంగా పట్టాలు చేసుకుని ప్రభుత్వ నుండి రాయితీలు పొందిన వారిపై చర్యలకు అధికారులు వెనకడుగు వేస్తున్నారని పేదవాడు తప్పు చేస్తే జైల్లో వేస్తారు ధనమున్నవాడు దోచుకుంటే మాత్రం ఇలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేదవాడికి ఒక న్యాయం; ఉన్నోడికి ఇంకో న్యాయమా అని మంథని డివిజన్ దళిత సేన అధ్యక్షుడు ఊట్ల శ్రీను అన్నారు మంగళవారం రోజున పోతారం గ్రామంలో మంథని డివిజన్ దళిత సేన అధ్యక్షుడు ఊట్ల శ్రీను విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముత్తారం మండలం లోని పోతారంలో 59 సర్వే నెంబర్లు 113 సర్వే నెంబర్లు లలో అక్రమ పట్టాలు తొలగించి అక్రమార్కులపై కేసు నమోదు చేయాలని మండల స్థాయి జిల్లా స్థాయి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేస్తూ అలుపెరగని పోరాటం చేయడంతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అక్రమ పట్టాలను తొలగించి కేసులు నమోదు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు అక్రమ పట్టాలు చేయించుకొని ప్రభుత్వాలను ప్రభుత్వ అధికారులను తప్పుదోవ పట్టించి ఆ పట్టాల పైన బ్యాంకుల నుండి రుణాలు పొంది ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకొని దాచుకున్న వారిపై ఎందుకు క్రిమినల్ కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు స్వయంగా కలెక్టర్ శ్రీ హర్ష అక్రమ పట్టాలను రద్దుచేసి 40 రోజులు కడుతున్న అక్రమార్కులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు అక్రమ పట్టాలను తొలగించి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపిన అధికారులు ఇప్పటికీ 40 రోజులు గడుస్తున్నా అక్రమ పట్టాదారులపై ఎలాంటి కేసులు నమోదు కాలేదని అన్నారు ఏలాంటి రికవరీ చేయలేదని ఇలాంటి వాళ్లకు శిక్ష పడాలి లేనిపక్షంలో పెద్ద ఎత్తున పేదల పక్షాన నిలబడి అక్రమ పట్టాదారులపై శిక్ష పడే అంతవరకు పోరాటం ఆపేది లేదని ఊట్ల శ్రీను తెలిపారు.




# అనంతారం గ్రామంలో తక్కువ ఖర్చు తక్కువ సమయం తో షేర్వెల్ టెక్నాలజీతో ఇందిరమ్మ ఇల్లు గృహ నిర్మాణం

**జగిత్యాల ప్రతినిధి ::అర్జున్ సమాచారం ఆగస్టు 11::**

జగిత్యాల మండలం అనంతారం గ్రామంలో గాదె సంధ్య శ్రీనివాస్ గారి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలించిన ఎమ్మెల్యే. షేర్వాల్ టెక్నాలజీ తో అతి తక్కువ ఖర్చు తక్కువ సమయంలో ఇళ్లు నిర్మాణం చేపట్టడం తో పరిశీలించిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. హబ్సి పూర్ కి చెందిన యువత సతీష్ విద్యాసాగర్ ఆధ్వర్యం లో షేర్వాల్ టెక్నాలజీ తో ఇళ్ల నిర్మాణం చేపట్టడం అభినందనీయం. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు తో పేదల ప్రజల సొంతింటి కల సాకారం. 450 గజాలలోరూఫ్ 650గజాలలో 5లక్షల లో ఇళ్లు నిర్మాణం పూర్తి. పేద ప్రజలకు అప్పుల భారం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం షేర్వాల్ టెక్నాలజీ నీ ప్రోత్సహిస్తుంది. డబల్ బెడ్ రూమ్ ,హాల్ కిచెన్ తో నిర్మాణం. భారత దేశంలో ఎక్కడాలేని విదంగా తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం లో ముఖ్యమంత్రి గారు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నారు. మొదటి విడత 3500ఇళ్లు మంజూరు అయ్యాయి2వ విడత లో 2వేల ఇళ్లు మంజూరు కానున్నాయి.. ఇందిరమ్మ ఇళ్లు గొప్ప కార్యక్రమం. గ్రామ గ్రామాన పండుగ వాతావరణం నెలకొంది. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం కాదు. యువత సొంత ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలీ అన్నారు. తక్కువ ఖర్చు తో నిర్మించే ఈ టెక్నాలజీ నీ లబ్ధిదారులు ఆలోచన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, పాక్స్ చైర్మెన్ సందీప్ రావు, సీనియర్ నాయకులు బాల ముకుందం, ఖఎఎ మాజీ చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి, నాయకులు శ్రీపాల్, తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలపై తల్లిదండ్రుల నిరంతర పర్యవేక్షణ అవసరం







## డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.. విద్యార్థులు లక్ష్యసాధనపై దృష్టి సారించాలి

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 11:**

పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా వారిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నూతన విద్యార్థుల కోసం నిర్వహించిన పరిచయ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసీపీ మడత రమేష్, సింగరేణి సంస్థ ఆర్జీ-3 జనరల్ మేనేజర్ మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్టు జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలపై నిత్యం కన్నేసి ఉంచాలని, వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని సూచించారు. పిల్లలు తప్పు చేసినప్పుడు వారిని సమర్థించకుండా, తప్పును గుర్తించి సరిదిద్దే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. విద్యార్థులు చదువుపైనే ప్రధానంగా దృష్టి సారించాలని, ఇతర అనవసర వ్యవహారాల్లో తలదూర్చవద్దని సూచించారు. పిల్లల చర్యల కారణంగా తల్లిదండ్రులు చట్టం ముందు దోషులుగా నిలబడే పరిస్థితి రాకుండా జాగ్రత్త వహించాలని హితవు పలికారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల వంటి చెడు వ్యసనాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించేందుకు సరైన మార్గాన్ని ఏర్పరచుకోవాలని, గమ్యం తప్పకుండా ముందుకు సాగాలని అన్నారు. కళాశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చక్కటి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు మంచి పేరు ఉందని, అదే పేరును భవిష్యత్తులోనూ కొనసాగించేలా విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని కోరారు. కళాశాల పరిసర ప్రాంతాలపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్ కుమార్ పవర్ ప్రజెంటేషన్ ద్వారా హాజరు, క్రెడిట్లు, పరీక్షలు, వివిధ సబ్జెక్టులకు సంబంధించిన అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

# మహా ముత్తారం మండలంలో అంగన్వాడీ కేంద్రాల ప్రారంభం -- లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ





**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 11:**

మహా ముత్తారం మండలంలోని ములుగు పల్లి గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాలు, అలాగే మహా ముత్తారం 2 పరిధిలో మరో రెండు అంగన్వాడీ కేంద్రాలను రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు ప్రారంభించారు. అనంతరం మహా ముత్తారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 34 కళ్యాణ లక్ష్మి, 17 సీఎంఆర్ఎఫ్ మరియు ఇందిరమ్మ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు మాట్లాడుతూ, మహా ముత్తారం మండలానికి సంబంధించి ఈరోజు నాలుగు అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించడం సంతోషకరమని తెలిపారు. గత ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇళ్లను అందించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి బిల్లులు పొందినట్లు ఆన్లైన్‌లో చూపించినప్పటికీ అర్హులకు ఇళ్లు అందని పరిస్థితి ఉంటే, అలాంటి విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. మహా ముత్తారం ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, ఆస్పత్రి వంటి మౌలిక వసతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే కొన్ని ప్రధాన రోడ్ల పనులు పూర్తయ్యాయని, మిగిలిన అభివృద్ధి పనులను కూడా వేగవంతంగా పూర్తి చేసి ఈ మారుమూల ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మంథని నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎల్లప్పుడూ ఆకాంక్షిస్తున్నానని, ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని మంత్రి శ్రీధర్ బాబు గారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హర్ హర్ తిరంగా..

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి.. దేశ సమైక్యతను చాటాలి

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 11:**

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట్ర శాఖల పిలుపు మేరకు కమాన్‌పూర్ మండల కేంద్రంలో మంగళవారం జాతీయ జెండాను మండల బీజేపీ అధ్యక్షులు కొయ్యడ సతీష్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి భారతీయుడిలో దేశభక్తి, జాతీయతా భావాన్ని మరింత బలోపేతం చేయడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని చాటాలని పిలుపునిచ్చారు. దేశం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ జాతీయ జెండాకు గౌరవం ఇవ్వడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మచ్చుగిరి రాము, కార్యక్రమ కన్వీనర్ సాగంటి లక్ష్మణస్వామి, సీనియర్ నాయకులు మట్ట శంకర్, ఇరువురాల పోశం, జంగపల్లి అజయ్, మల్లారపు అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి విశ్వతేజ, ఉపాధ్యక్షులు పిల్లి చంద్రయ్య, కొమ్ము శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# కమాన్‌పూర్‌లో కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

## అర్హులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 11:**

కమాన్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పథకం కింద కొత్త పింఛన్ల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఉపసర్పంచ్ రఫీక్ సోహెల్ మాట్లాడుతూ చేయూత పథకం కింద అర్హత కలిగిన వారికి కొత్త పింఛన్లు మంజూరు కానున్నందున అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వారు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయానికి హాజరై దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి పింఛన్లు మంజూరు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, వార్డు సభ్యులు పచ్చునూరి రాజ్‌కుమార్, మెరుగు కుమార్, మిట్ట సందీప్, గోడిశెల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthaminagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.